

# 'వంచన'

మల్లాది వెంకటకృష్ణమూర్తి

సన్‌ఫ్లవర్.

సన్‌ఫ్లవర్ సినిమా నడుస్తోంది ఏర్ కండిషన్డ్ సినిమా థియేటర్‌లో, తెరమీద. చక్కటి ప్రేమ కథ కళ్ళముందు మనసుకు హత్తుకునేలా సాగిపోతోంది.

ఇంటర్వెల్‌లో లైట్లు వెలిగాయి.

చీకట్లో తనెవరి ప్రక్కన కూర్చున్నానా అని చూసింది పారిజాతం. తనవంకే చూస్తున్నాడు అతను.

చిరునవ్వు నవ్వాడు నందనరావు.

"నువ్వా? ఎక్కడ నుంచి వూడిపడ్డావ్?" అడిగింది పారిజాతం. నందనరావుకి అనేక భావాలు గోచరించాయి ఆ ప్రశ్నలో.

"పెళ్ళయిందిటగా. ఎక్కడుంటున్నావ్ ? ఎలా వున్నావ్ ?" అడిగాడు నందనరావు ఆప్యాయంగా.

"ఎక్కడైనా సరే. కులాసాగా, హాయిగా వుంటున్నాను."

"నా కంతకంటె ఇంకేం కావాలి పారిజాతం" అన్నాడు నందనరావు గద్గద స్వరంతో.

"హు. మొగాళ్ళంతా ఇంతే."

"ఏం ? పెళ్లి చేసుకోకుండా మోసం చేసానా ?"

"ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటాననీ నమ్మించిన ఏ మగాడు తన మాట మీద నిలబడ్డాడు ?"

"అందరి సంగతీ నాకు తెలియదు కాని, నాకు కొన్ని కారణా లున్నాయి. నేను పెళ్లి చేసుకోకపోవటం వల్ల నీకు మంచే జరిగింది."

"పట్టుపడ్డ మగాడు చెప్పే మొట్టమొదటి మాటే ఇది. నన్ను నమ్మించడానికి ప్రయత్నించక."

దిగులుగా నవ్వి అన్నాడు నందనరావు. "నేను ప్రయత్నించడం లేదు."

"ఆ రోజు రైలు స్టేషన్‌లో ఆఖరిసారి వెళ్తూ కూడా ముహూర్తం వేళకి తిరిగి వస్తానని చెప్పి నమ్మించి వెళ్లావు. రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి, నీ కోసం ఎదురు చూసి చూసి, విసిగి, వేసారి తిరిగి వచ్చాను ఇంటికి. నేను వ్రాసిన వుత్తరం ఇంట్లో అప్పటికి ఇంకా ఎవరూ చూడకపోవటం మంచిదయింది."

నందనరావు పెదవి విప్పలేదు.

"నువ్వంటేనే నాకసహ్యం. ఐహేట్‌యు."

లైట్లు ఆరిపోయాయి. మళ్లీ కథ తెర మీద ప్రాణం పోసుకోవటం ఆరంభించింది పంచ రంగుల్లో.

హీరోయిన్ తన ప్రియుడి కోసం వెదికి వెదికి వేసారి, ఓ చోట రైల్లో కంపార్ట్‌మెంట్‌లో ఏడుపుని ఆపుకోలేక పోతుంది, అప్పటికే తన ప్రియుడికి పెళ్లయిపోయిందన్న సంగతి తెలిసి.

"చెప్పాగా. మొగాళ్ళంతా ఇంతే ప్రపంచంలో ఏ చోట వున్నా" అన్నది పారిజాతం.

నందనరావు మాట్లాడలేదు.

సినిమా అయిపోయింది. జనం అంతా వెళ్లిపోయి, థియేటర్ ఖాళీ అయిపోయింది. నిశ్శబ్దంగా వున్న ఆ థియేటర్లో ఇద్దరూ అలానే కూర్చున్నారు కొన్ని క్షణాలు.

"కదులు" అన్నది పారిజాతం.

"దేనికి నీ కళ్లలో నీళ్ళ ?" అడిగాడు నందనరావు

"నా గుండెలో యింకా ఓ సాఫ్ట్ కార్నర్ వుంది గనుక."

ఇద్దరు థియేటర్ పనివాళ్లు చేతిలో క్రచ్ (కుంటివాళ్లు వుపయోగించే కర్ర)తో వచ్చి సహాయపడ్డారు నందనరావుకి. వాళ్ల సహాయంతో లేచి నిలబడ్డ నందనరావుకి కుడికాలు తొడనుంచి లేదు.

"ఆరోజు రైలు దిగుతుండగా జరిగిందిది. నీ కారణం ఇక చెప్పక్కర్లేదు. నన్ను తప్పు అంచనా వేసుకుని, అందరి మొగాళ్లలో కలిపేశావ్ నన్ను."

ఆ యిద్దరి సహాయంతో కుంటి నందనరావు నిశ్శబ్దంగా, మళ్లీ వెనక్కితిరిగి చూడకుండా, బయటకి నడిచాడు. నివ్వెరపోయి చూస్తూండిపోయింది పారిజాతం.

బయటకి వచ్చేసరికే, నందనరావు రిక్షాలో కూర్చుని, కుడిచేత్తో పెడల్ త్రిప్పుతూ అప్పటికే గేటు దాటుతున్నాడు.

కారు హారన్ విని వెళ్లి తలుపు తెరచుకుని కూర్చుంది పారిజాతం, పార్కింగ్ లాట్‌లో ఆగివున్న కారులో.

"ఆలస్యమయిందేం మమ్మీ ? మేం వచ్చి చాలాసేపయింది." అడిగాడు పారిజాతాన్ని అయిదేళ్ల కొడుకు.

"ఎలావుంది సినిమా ?" అడిగాడు పారిజాతం భర్త.

"డాక్టర్ ఏమన్నాడు ?" ఆత్రుతగా అడిగింది.

చిన్నగా నిట్టూర్చి అన్నాడు పారిజాతం భర్త.

"పక్షవాతంతో కాళ్లు పడిపోయిన మనిషిని పెళ్లి చేసుకున్న పిచ్చిదాన్ని నిన్నొక్కతనే చూసాను పారిజాతం. నీ ఆరాటంతప్ప భగవంతుడి ఆశీర్వచనం లేదు నాకీ జన్మలో. ఇక రావని."

డ్రయివర్ కారుని బయటకు పోనించి, దగ్గిరలోనే వున్న ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆపాడు కారుని. పారిజాతం కారుకి కొంచెం ముందు ఆగివున్న నందనరావు హేండ్ పెడల్ రిక్షాని, నందనరావుని చూసి అనుకుంది మనసులో.

"దేముడు సిగ్నల్ ఇవ్వటానికి ఇష్టపడలేదు మా విషయంలో. నేనుకాదు తప్పు అంచనా వేసుకుంది."



# * సినిమా విశేషాలు *

## తీర్పు

విశ్వశాంతి విశ్వేశ్వరరావు వ్రాసిన కథ యిది. దీనిని కథ అనడంకన్నా జరుగుతున్న సంఘటనల హారం అనడం వుచితం. ఈ చిత్రానికి ఆయనే దర్శకుడు. మైసూరు ప్రీమియర్ స్టుడియోలో "తీర్పు" పూర్తయింది. సమాజ వికాసాన్ని కాంక్షించే యితివృత్తం వుండడంవల్ల దీనిని ప్రయోజనాత్మకం అనడం న్యాయం.

## కొత్తవాళ్ల ప్రతాపం

"తీర్పు" చిత్రంలో ముఖ్య పాత్రలను పోషించిన వాళ్లందరూ కొత్తవాళ్లే. వాళ్ల పేర్లు : సురేష్‌కుమార్, మనోరంజన్, కృష్ణాజీ, సంగీతా, సుజాతాభాగత్, బాలానందం విశ్వేశ్వరరావు.

కొత్త వాళ్లందరికీ విశ్వేశ్వరరావు యిచ్చిన శిక్షణ వృధా గాకుండా మేలు చేసిందని చిత్రం చూచినవాళ్లు చెప్పారు. ఎవరికి ఎవరూ తీసిపోకుండా తమ కిచ్చిన పాత్రలలో ప్రతాపం చూపించినట్లు చెప్పారు. సహాయ భూమికలను సావిత్రి, ప్రభాకరరెడ్డి, ధూళిపాళ, ముక్కామల, రంగారావు, ఎం. పి. ప్రసాద్, శ్యామల ధరించారు.

తెలుగు చిత్రాలకు బంగారు పతకం రావడంలేదు... రాదా అన్న సందేహాన్ని వెలిబుచ్చే వాళ్లకు "తీర్పు" చిత్రం వుపశమనం కలిగించవచ్చు.

## కీర్తి - కాంత - కనకం

"తీర్పు" చిత్రాన్ని నేర్పుగా చిత్రీకరించినందుకు నా అభినందనలు అందుకోండి అంటూ విశ్వేశ్వరరావు గదిలో అడుగు పెట్టాను. కాస్సేపు అందులో నటించిన కొత్తవాళ్లను గూర్చి చర్చించాము.

మీ తరువాతి పథకం ఏమిటి అని అడిగాను. "తీర్పు" చిత్రంలో పనిచేసిన వాళ్లతోటి "కీర్తి — కాంత — కనకం" చిత్రాన్ని రంగులలో నిర్మించడానికి నిశ్చయించినట్లు చెప్పారు. తనే దర్శకత్వాన్ని చేపట్టారు.

ఈ కథను పద్మినీ రాజన్ వ్రాశారు. మాటలను, సినిమా అనువాదాన్ని శ్రీ శ్రీ, విశ్వేశ్వరరావు సమకూరుస్తారు. ఈ మూడింటికీ లొంగని మనిషి ఎవరయినా వున్నారా ? కీర్తికోసం, డబ్బుకోసం, కాంతకోసం వులలాట పడనివాళ్లు వుండగలరా ? దీనిమీద విశ్వేశ్వరరావు స్వారస్యమయిన కథను తయారు చేశారు.

విజయనిర్మల, గుమ్మడి : చిత్రం "ధనవంతులు—గుణవంతులు"

